

# అమెరి'కా'లేజ్

## - లిపి మల్లాది



*అమెరికాలో కాలేజీ చదువంటే ఒకప్పుడు గగనకుసుమం, అదో ఇంద్రజాలం. గత రెండు, మూడు దశాబ్దాల్లో అమెరికాలో చదువుకోసం వస్తున్న విద్యార్థుల సంఖ్య గణనీయంగా పెరగడమే కాక, ఇండియాలో కూడా ఒక మాదిరిగా చదువుకున్న కుటుంబాల్లో దాదాపు ప్రతి ఇంటికీ కనీసం ఒకరైనా అమెరికాలో చదువుకుంటున్న పిల్లలుంటున్నారు. ఇంటర్నెట్ అరచేతిలోకొచ్చేసిన ఈ రోజుల్లో అమెరికాలో కాలేజీలు ఎలా ఉంటాయో, అక్కడ డార్మ్స్ ఎలా ఉంటాయి, స్టూడెంట్స్ జీవితాలు ఎలా ఉంటాయో... అనే విశేషాలు అతి సులువుగా తెలిసిపోతున్నట్లనిపిస్తున్నాయి. ఐనా మొదటిసారి చదువుకోసం అమెరికా వచ్చే ప్రతి విద్యార్థికీ ఎవరి అనుభవం వారిదే, ఎవరి ఇబ్బందులు వారివే, ఎవరి స్నేహాలు వారివే. ఈ నేపథ్యంలో అమెరికాలో చదుకోసం వచ్చిన ఓ సాధారణ మధ్యతరగతి అమ్మాయికి ఎదురైన సంఘటనలు, సన్నివేశాలు.. స్నేహాలు, సంతోషాలు.. సరదాలు.. వెరసి ఇవన్నీ అమెరికాలేజీ కథలు. స్వానుభవాలనూ, విన్న అనుభవాలనూ, చూసిన అనుభవాలనూ - ఆసక్తికరమైన ధారావాహికగా కౌముది పాఠకులకు అందిస్తున్నది లిపి మల్లాది. 'నా కళ్ళతో నాన్న' ధారావాహికతో కౌముది పాఠకుల అభిమానాన్ని సొంతం చేసుకున్న లిపి మల్లాది ఈ ధారావాహికతో మీకు మరింత చేరువౌతుందని ఆశిస్తూ..*

*- సంపాదకుడు*

*(క్రిందటి సంచికనుంచి కొనసాగింపు)*

"ఒకళ్ళు చెప్పింది విని భయపడిపోతావా?" పెద్దగా నవ్వాడు అన్నయ్య.

"హలో కూడా చెప్పకుండా ఎగతాళి చెయ్యాలా?" చిరాకుపడ్డాను.

"మరి లేకపోతే ఏంటి? ఎవరో ఒకళ్ళు ఒక్క ప్రొఫెసర్ మంచాయనకాదు అంటే అలా భయపడిపోతావా?" ఇంకా పెద్దగా నవ్వాడు.

"నేనేం భయపడలేదు"

"మరి?" నవ్వు ఆగలేదు.

"ఊరికే నీకు చెప్పాను అంతే"

కష్టపడి నవ్వాపుకున్నాడని స్పష్టంగా తెలిసింది.

"దేవ్‌ని నువ్వు నీతోపాటు ఏరోనాటికల్‌లో చేరమన్నావు గుర్తుందా?"

ఆఁ గుర్తుంది"

"ఏమన్నాడు?"

"ఏరోనాటికల్ చాలా కష్టం. ఫిజిక్స్ ఎక్కువ ఉంటుంది. మార్క్స్ కూడా చాలా స్ట్రిక్ట్‌గా వేస్తారు అన్నాడు"

"అప్పుడు నువ్వేం చేసావు?"

"అలా ఏం కాదు, ఏ రోజు పాఠాలు ఆ రోజు చదువుకుంటే ఈజీనే అన్నాను"

"తనేం చేసాడు?"

"నా మాట వినలేదు. తనవల్లకాదని కంప్యూటర్ సైన్స్ తీసుకున్నాడు"

"రేపు దేవ్ నీ దగ్గరకి వచ్చి 'ఇదేదో పని నువ్వు చెయ్యాలనుకుంటున్నది చాలా కష్టం' అంటే ఏం చేస్తావ్?"

"పట్టించుకోను"

"ఏ?"

"ఎందుకంటే దేవ్‌కి అంత బ్రైన్ లేదు. ఏరోనాటికల్ ఈజీ అన్నా వినిపించుకోలేదు. తనకి అన్నీ కష్టమే. నేను తనలా మొద్దుని కాదు" గర్వంగా చెప్పాను.

"దేవ్ వేరే ఎవరికో ఉచిత సలహా ఇస్తే?"

"పట్టిచ్చుకోవద్దని చెప్తాను"

"నీకు ఉచిత సలహా ఇచ్చి విట్‌మన్ గురించి చెప్పినతను ఎవరికో దేవ్ నీకు కొత్తకాబట్టి నమ్మి భయపడుతున్నావు. తన మాటలు ఎంతవరకు వినచ్చో, ఎంతవరకు నిజమైనవో నీకు తెలీదు. కొన్ని నెలలదాకా నీకు తన కృషి, పట్టుదల తెలీవు. దేవ్ వేరే ఎవరికో 'ఏరో స్పేస్ చాలా కష్టం. తీసుకోకు అని చెప్పాడని వాళ్ళు కూడా కంప్యూటర్ సైన్స్ తీసుకుని ఉంటే? నువ్వు ఇవాళ్ళ వాళ్ళని చూసి నవ్వేదానివి. అలాంటి పరిస్థితికి నిన్ను నువ్వు తెచ్చుకుంటున్నావు. రేపు ఎవరో నిన్ను చూసి 'అతని మాటలు విందా' అని నవ్వుకోవచ్చు. నేను చెప్పేది అర్థమౌతుందా?"

"అర్థమౌతుంది కానీ అల్ట్‌మన్ మంచాయనట"

"నీకెలా తెలుసు నిజమని? చూసావా?" కోప్పడ్డాడు.

"లేదు. కానీ విట్‌మన్‌కి ఇండియన్స్ అంటే ఇష్టంలేదుట. మనని కించపరుస్తాడట. అమెరికన్స్‌తో మాత్రమే బాగా మాట్లాడతాడట. మనవాళ్ళందరికీ తక్కువ మార్కులు కావాలని వేస్తాడట"

"పోనీ. మంచిదేకదా"

"మంచిదా? నేను చెప్పిందసలు విన్నావా?" దబాయించాను.

"యా. విన్నాను తల్లి. మొత్తం వింటూనే ఉన్నా. నువ్వు మాస్టర్స్ పూర్తయ్యాక ఏం చేస్తావు?"

"జాబ్?"

"ఎక్కడ?"

"తెలీదు."

"అమెరికానా? ఇండియానా?"

"అమెరికానే"

"అమెరికాలో ఇంతకుముందు పనిచేసావా?"

"లేదు"

"ఇక్కడ పని ఎలా ఉంటుందో తెలుసా?"

"ఆఫీసులో ఎవరెవరుంటారు? ఎలా ఉంటారు ఏమైనా ఐడియా ఉందా?"

"అబ్బా, విసిగించకు" అరిచాను.

"ఇక్కడ చాలావరకు అమెరికన్స్ ఉంటారు. కొంతమంది మంచివాళ్ళు, కొంతమంది చెడ్డవాళ్ళు. కొంతమంది సహాయం చేస్తారు, కొంతమంది సతాయిస్తారు. అందరూ మంచివాళ్ళు ఎక్కడా ఉండరు. నీకు ఇంకా అవేర్‌నెస్ లేదు, అంతే. విట్‌మన్‌లాంటి వాళ్ళు వందమందిలో ఒకళ్ళు కాదు, పదిమందిలో ఇద్దరు. ఆఫీస్‌లో రూల్స్ వల్ల డైరెక్ట్‌గా కాకుండా ఇన్ డైరెక్ట్‌గా రేసిజమ్ చూపిస్తారు. నువ్వు విట్‌మన్ గురించి చెప్పావ్, ఆయనలాగే. నువు ఇంకా స్టూడెంట్‌వి. యూనివర్సిటి గైడ్ లైన్స్ చాలా స్ట్రిక్ట్. ఆయన మీద ఎవరైనా కంప్లైంట్ ఇచ్చి, అది రుజువైతే ఆయనకి ఇంక ఎక్కడా ఉద్యోగం దొరకదు. ఒళ్ళు దగ్గరపెట్టుకునే పనిచేస్తారు ఎవ్వరైనా. నువ్వు ఎక్జాంలో కరెక్ట్ ఆన్సర్ రాస్తే బ్రహ్మదేవుడు వచ్చినా ఆయన నీకు మార్కులు ఇవ్వక తప్పదు. అదే నువ్వు తప్పు రాస్తే ఆయన తెల్లవాడైనా, నల్లవాడైనా, ఇండియన్ అయినా మార్కులు ఇవ్వడు. అది నీ చేతిలో ఉంది"

"కరెక్టే"

"ఇప్పుడు నువ్వు అలాంటి ఆయన దగ్గర పనిచేస్తే నీకు ఫ్యూచర్‌లో చాలా హెల్ప్ అవుతుంది. అంత స్ట్రిక్ట్ వ్యక్తిని నువ్వు మెప్పించగలిగితే ఆఫీసులో మేనేజర్‌ని, కో వర్కర్స్‌ని ఈజీగా మెప్పించేస్తావు. నీకు ఇది మొదటి మెట్టు. ఇలాంటివాళ్ళు ఎంతోమంది ఎదురుపడతారు. ఇది నీకు ప్రాక్టీస్ అనుకో. ఇప్పుడు ఇదే కష్టం అనిపిస్తే ఫ్యూచర్‌లో చాలా కష్టం"

"సరే. కరెక్టే నువ్వు చెప్పేది"

"ఇప్పుడు నువ్వు మాస్టర్స్ చేస్తున్నావు. ప్రాక్టికల్‌గా ఆలోచించు. ఇంజనీరింగ్ పూర్తిచేసి అమెరికాకి వెళ్ళడం కాదు నీ ధ్యేయం. మాస్టర్స్ పూర్తిచేసి ఉద్యోగం సంపాదించి స్థిరపడాలి. ఇప్పుడు నువ్వు పెద్దదానివపోయావు. యు ఆర్ నాట్ ఎ గర్ల్ ఎనీ మోర్. నువ్వు చిన్న విషయాలకి భయపడకూడదు. ధైర్యం తెచ్చుకో.. ఫ్యూచర్‌కి ఎలా ఉపయోగపడుతుందో ఆలోచించు."

"సరే. అంతే చేస్తాను."

"నీకు ఇప్పుడే అన్నీ ఏ గ్రేడ్‌లు రావు. కష్టపడు. కష్టపడడం నేర్చుకో. వంకలు పెట్టకు. 'నా మేనేజర్ చాలా పని ఇచ్చాడు. నా టీచర్ చాలా హోం వర్క్స్ ఇచ్చారు' లాంటి కంప్లైంట్స్ ఉండకూడదు. 'ఇది నేను ఇంకా పూర్తి చెయ్యలేదేంటి, అదెందుకంత కష్టంగా ఉంది' లాంటి ప్రశ్నలు రావాలి"

"సరే అయితే. అలానే ఉంటాను."

"ఇంకేంటి సంగతులు? ఎలా ఉన్నారు కొత్త ఫ్రెండ్స్"

"జరిగిన భాగవతమంతా చెప్పాను.

"అలవాటైపోతుందిలే బెంగపడకు. కొన్ని రోజుల్లో నాకన్నా వాళ్ళే నీకు ఎక్కువ క్లోజ్ అవుతారు."

ఏమీ మాట్లాడలేదు.

"ఒక్కటి మాత్రం గుర్తుపెట్టుకో. వాళ్ళు చుట్టుపక్కల్లో ఉండే అవకాశం ఉన్నప్పుడు వాళ్ళ గురించి చెడు మాట్లాడకు. పొరపాటున వాళ్ళ చెవిన పడినా, నీకు చాలా కష్టమవుతుంది."

"సరే"

"ఎవరికీ ఎవరి గురించి చెడు చెప్పకు. వాళ్ళు నీకు ఎంత క్లోజో వేరేవాళ్ళకి అంతకన్నా క్లోజ్ అవ్వచ్చు. మర్చిపోకు"

"సరైతే"

"ఓకే మరి. ఇంకేమైనా అవసరం వస్తే ఫోన్ చెయ్యి."

"ఓకే"

"జాగ్రత్త. భయపడకు"

"అలాగే"

"బాయ్"

ఫోన్ పెట్టాక కడుపులో దుఃఖం కలిగింది.

"ఎవరితో మాట్లాడావు?" హనీష అడిగింది.

"మా అన్నయ్యతో"

"ఎంత వినయంగా, విధేయంగా 'ఓకే, సరే, కరెక్టే' అన్నావు? అదే నేనైతే ఎంతో గొడవపడి ఉండేదాన్ని" నవ్వింది.

అన్నయ్య చెప్పిన 'వాళ్ళగురించి చెడు మాట్లాడకు. వాళ్ళకి తెలిసే ఆస్కారం ఉంటుంది' అన్నమాటలు నిజమే అనిపించింది.

(కొనసాగింపు వచ్చే నెలలో)

Click here to share your comments on this story